యధావిధిగా పోలీసు కార్యాలయంలో ప్రతీ సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్

ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో శాశన మండలి ఉప ఎన్నికకు వెలువడిన నోటిఫికేషనును రాష్ట్ర ఎన్నికల కమీషను రద్దు చేయడంతో ఇకపై ప్రతీ సోమవారం యధావిధిగా పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ సిస్టంను నిర్వహించనున్నట్లుగా నవంబరు 16న తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమీషను జిల్లాలో శాశన మండలి ఉప ఎన్నికకు వెలువడిన నోటిఫికేషనును రద్దు చేయడంతో యధావిధిగా జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతీ సోమవారం 'పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ సిస్టం' ద్వారా ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. కావున, ఈ నెల 18న జిల్లా పోలీసు కార్యాలయంలో 'పబ్లిక్ గ్రీవియన్స్ సిస్టం'ను యధావిధిగా నిర్వహిస్తామన్నారు. ఫిర్యాదులు చేసేందుకు ఆసక్తి ఉన్న ప్రజలు జిల్లా పోలీసు కార్యాలయంకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చునని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

అందరూ టాయిలెట్లను వాడేలా మార్పు తీసుకురావాలి

కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్

-19న మరుగుదొడ్ల దినోత్సవం- డిసెంబర్ 10 వరకు జిల్లా అంతటా అవగాహనా సదస్సులు

- సానిటరీ వర్కర్స్ కు సన్మానాలు, ఉత్తమ టాయిలెట్లకు పురస్కారాలు

విశాలాంధ్ర-విజయనగరం: ఈ నెల 19 న ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని 19 నుండి డిసెంబర్ 10 వరకు జిల్లా అంతటా హమారా సౌచాలయ, హమారా సమ్మాన్ పేరుతో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమాలను జిల్లా స్థాయి, నియోజకవర్గం, మండల స్థాయి, గ్రామ స్థాయిలలో నిర్వహించాలని, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరయ్యేలా చూడాలని తెలిపారు. గ్రామ కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు అన్ని గ్రామాల్లో, మండలా ల్లో 19న లాంచనంగా ప్రారంభం కావాలన్నారు. శనివారం కలెక్టర్ ఎం.పి.డి.ఓ లు, మండల ప్రత్యేకాధికారులు, మున్సిపల్ కమీషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19 న టాయిలెట్లు మంజురైన వారం దరికి మంజూరు లేఖలు అందించాలని తెలిపారు. గ్రామ స్థాయి లో, మండల స్థాయిలో, జిల్లాస్థాయిలో పోటీలను నిర్వహించి ఉత్తమ వ్యక్తిగత, కమ్యూనిటీ మరుగుదొడ్లకు బహుమతులను అందజేయాలని తెలిపారు. ఆరోగ్య, అంగన్వాడీ, ఆర్.డబ్ల్యు.ఎస్ , అధికారులు సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. వినియోగంలో లేని టాయిలెట్లను గుర్తించి వినియోగం లోకి తెచ్చేలా అవగాహన కలిగించడం, నిర్వహణపై చైతన్యం చేయడం జరగాలన్నారు. ఈ కాంపెయిన్ లో భాగంగా పాఠశాలలలో , అంగన్వాడీ కేంద్రాల్లో ఆసుపత్రుల్లో టాయిలెట్ల మరమ్మత్తులు ఉన్నవాటిని గుర్తించి మరమ్మతులకు ప్రతిపాదనలు పెట్టాలన్నారు. వాటర్ ట్యాంక్ లలో నీటిని తనిఖీలు చేయాలనీ, పారిశుధ్యం పై , బహిరంగ మల విసర్జన పై అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. సానిటరీ పని వారికి పని ముట్లను అందజేయడం, సన్మానించడం వంటి కార్యక్రమాలతో పాటు వారికీ ప్రభుత్వ పధకాలను అందేలా వారిని నమోదు చేసుకోవాలన్నారు. టాయిలెట్లను వాడేలా ప్రవర్తనా మార్పులను తీసుకురావాలని, ఓ.డి.ఎఫ్ కోసం కృషిచేసిన వారిని ప్రత్యేకంగా సన్మానించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నిటి లో ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చూడాలని, వారికీ ముందుగానే ఆహ్వానాలు పంపాలని తెలిపారు. సమావేశం లో జిల్లా పరిషత్ సి.ఈ.ఓ సత్యనారాయణ, డ్వామ ఇంచార్జ్ పి.డి కళ్యాణ చక్రవర్తి, డి.పి.ఓ వెంకటేశ్వర రావు, ఆర్.డబ్ల్యు.ఎస్. ఈ ఈ ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల యాజమాన్యాలు కార్మికులకు రక్షణ భద్రత ప్రమాణాలు పూర్తిస్థాయిలో పాటించాలి

తహశీల్దార్ ఎం శ్రీను

విశాలాంధ్ర-బొబ్బిలి : గ్రోత్ సెంటర్లో బెర్రీ పరిశ్రమ విక్టోరీ పరిశ్రమ లో భద్రత ప్రమాణాల పైన తహశీల్దార్ ఎం శ్రీను పరిశీలన చేశారు .పరిశ్రమలో పనిచేసే కార్మికులకు భద్రత ప్రమాణాలు పాటించాలని, కాలుష్య నివారణకు చర్యలు చేపట్టాలని నిబంధనలు పాటించని పరిశ్రమల యాజమాన్యాల పైన కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ ఎం శ్రీను హెచ్చరించారు. ప్రాజెక్టు రిపోర్టు, కార్మికులకు కల్పిస్తున్న భద్రత ప్రమాణాలు, పూర్తిస్థాయిలో వివరాలను సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో అందజేయాలని ఆయా పరిశ్రమ యాజమాన్యాలకు తెలియజేశారు. బెర్రీ పరిశ్రమలో అవసరమైన ఇసుక ఇసుక రీచ్ లు నుండి తీసుకుని వెళ్లాలని సూచించారు.

ఉద్యమ నాయకులు త్యాగాలు మరువలేనివి

విశాలాంధ్ర-తెర్లాం: స్థానిక తెర్లాం శాఖా గ్రంధాలయం లో ఉద్యమ నాయకులు త్యాగాలు మరువలేనివి.శాఖా గ్రంధాలయం అధికారి సి.హెచ్. కృష్ణమూర్తి అన్నారు.శనివారం 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఉద్యమ నాయకులు అయ్యంకి.వెంకట రమణయ్య, ఎస్.రంగనాదన్, రామలక్ష్మణ మూర్తి, పాతూరి నాగభూషణ చిత్రపటాలకు పూలమాల వేసి వారి త్యాగాలను కొనియాడారు.పుస్తక పఠనం వల్ల మరింత విజ్ఞాన వంతులు అవుతారని క్రాఫ్టు టీచర్ కె.విస్సు అన్నారు. ఈ సందర్భంగా ఏ.శ్రీనివాసు మాట్లాడుతూ యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమానికి పాఠకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక వైద్య శిబిరం

విశాలాంధ్ర-పూసపాటిరేగ: విభిన్న ప్రతిభావంతుల సమగ్ర ఆరోగ్య పరిరక్షణ ప్రత్యేక లక్ష్యంగా గౌరవ మెంబర్ సెక్రటరీ న్యాయ సేవా విభాగము అమరావతి, విజయ నగరం వారిసూచనలు మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖా ధికారి ఆదేశానుసారం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేసారు. మండలంలోని సాయి కోర్ స్వచ్ఛంద సంస్థ చే నడపబడుచున్న విభిన్న ప్రతిభావంతుల వసతి గృహములో ప్రత్యేక వైద్య శిబిరము ఏర్పాటుచేసి. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భోగాపురం, పూసపాటిరేగ ప్రాథమిక వైద్యులు ప్రత్యేక వైద్య శిబిరమును ఏర్పాటు చేసిరి. పూసపాటిరేగ వైద్యాధికారిని డాక్టర్ ప్రమీల దేవి ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు రక్త పరీక్షలు, జనరల్ ఎక్జామినేషన్ నిర్వహించి, చిన్న రుగ్మతలు ఉన్నవారికి మందులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమం లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ భోగాపురం నుండి డాక్టర్ ఎం మౌలిక, ఫిజియో తెరపిస్ట్ స్వాతి వైద్య సేవలు అందజేశారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి సంతోషి,సింహాచలం ఆరోగ్య సహాయకులు ఆర్ వి రమణ, సంస్థ డైరెక్టర్ ఆర్ ఎల్ ఎన్ శర్మ పాల్గొన్నారు.

సీతం కళాశాలలో అలేఖస్‌చే పూల్ క్యాంపస్ డ్రైవ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో అలేఖస్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ చే ఎంబిఏ, బిబిఏ విద్యార్థులకు పూల్‌క్యాంపస్ డ్రైవ్ నిర్వహించబడినది. దీనికిజిల్లా నుంచి పలు కాలేజీల విద్యార్థులు హాజరయ్యేరు. వీరికి జామ్, గ్రూప్ డిస్కషన్స్ నిర్వహించి 40 విద్యార్థిని విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ ప్రక్రియను అలేఖస్ డైరెక్టర్ ఆపరేషన్స్ పివినీల, హెచ్‌ఆర్ మేనేజర్ ఎస్ లక్ష్మి రేణుక హాజరయ్యారు ఈ సందర్భంగా సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు మాట్లాడుతూ ఎంబిఏ, బిబిఏ విద్యార్థులకు ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని దానికి వారు ఎల్లప్పుడూ తయారై ఉండాలని విద్యార్థులకు తెలియజేసారు. అలేఖస్ సభ్యులకు ధన్యవాదములు తెలిపారు. సీతం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి వి రామమూర్తి మాట్లాడుతూ ఎంబిఏ, బిబిఏ విద్యార్థులకు అవకాలను కల్పిస్తామని తెలియజేసేరు. ఇ కార్యక్రమాన్ని డీన్ ప్లేసెమెంట్స్, మానేజ్మెంట్ హెచ్ఓడి పర్యవేక్షణలో నిర్వహించారు.

నూతన విధానంతో వరిపంట అధిక దిగుబడి

బ్రహ్మకుమారీస్ కేంద్రం ఇన్చార్జి శైలజ

విశాలాంధ్ర-వేపాడ: బ్రహ్మకుమారిస్ ప్రవేశపెట్టిన నూతన యోగిక విధానం వల్ల వరిపంటలో అధిక దిగుబడులు సాధించవచ్చని శృంగవరపు కోట బ్రహ్మకుమారీస్ కేంద్రం ఇన్చార్జి శైలజ అన్నారు. శనివారం మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన వ్యవసాయ రైతు జొన్నపల్లి వెంకటరావు వరి పొలంలో ఇన్చార్జి ఆధ్వర్యంలో నూతన విధానంతో పండించిన వరి పంటను కోత ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా రూరల్ డెవలప్మెంట్ వింగ్ ద్వారా యోగిక వ్యవసాయం అనే కొత్త విధానాన్ని బ్రాహ్మణ కుమారి సంస్థ ప్రవేశపెట్టిందన్నారు.ఈ విధానం వలన అధిక దిగుబడులు సాధించడమే కాకుండా స్వచ్ఛమైన పంటను ఇచ్చి మనుషుల ఆరోగ్యానికి హాని లేకుండా చేస్తుందన్నారు. అలాగే రసాయన ఎరువులు వాడిన పంటకు దీటుగా యోగిక విధానం ద్వారా పంట దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారిస్ సంస్థ సభ్యులు కె రాజు, తదితరులు పాల్గొన్నారు.

పత్రికలు సమాజానికి పట్టుగొమ్మలు

సెంచూరియన్ వర్సిటీ ఛాన్సలర్ జీఎస్ఎన్ రాజు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ, ప్రతీ సమాచారాన్ని ప్రజలకు చేరవేస్తున్న పాత్రికేయులది సమాజంలో ఎప్పుడూ బాధ్యతాయుతమైన కీలక పాత్రేనని సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ జి.ఎస్.ఎన్.రాజు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆఫీసర్స్ క్లబ్ లో జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధి కోసం గ్రంథాలయ సేవా సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. పుస్తక పఠనం, నిరంతర ప్రయత్నం వలన గొప్ప స్థాయికి చేరుతారని విద్యార్థులు, యువతకు సూచించారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు ఎలిశెట్టి సురేష్‌కుమార్, ఎం.విజయ్‌భాస్కర్, వై.ఎస్.పంతులు, ఎన్.సన్యాసిరావు, కంది గౌరీశంకర్ లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కొత్తలి ఎర్నాయుడు, ఉపాధ్యక్షులు కె.దయానంద్, వ్యవస్థాపకులు అబ్దుల్ రవూఫ్, గౌరవ అధ్యక్షులు నాలుగెస్సులరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.బాలకృష్ణ, గ్రంథాలయ ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు రామభద్రరాజు, వాకర్ క్లబ్ సభ్యులు సత్యనారాయణమూర్తి, కందాల సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై పోలీసుల నిఘా

గంజాయి అమ్మకాలపై ఉక్కుపాదం

ఇప్పుడు జూదశాలలపైనా దేగకన్ను

శభాష్.. పోలీస్ అంటున్న పట్టణ వాసులు

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: గతకొంత కాలం వరకు విజయనగరం పట్టణంలో గంజాయి అమ్మకాలు, జూదశాలల నిర్వహణ గుట్టుగా సాగేవి. కానీ ఈచట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. జిల్లా ఎస్పీగా వకుల్ జిందాల్ బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి పోలీసు వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టారు. అంతా తానై, అందరికీ స్ఫూర్తి నిస్తూ సమర్ధవంతమైన పోలీసింగ్‌ను ప్రజలకు పరిచయం చేసారు. దీంతో పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలు చేసేవారి గుండెల్లో పోలీసులు నిద్రపోయేలా చేసారు.

ముందు గంజాయిపైనా.. ఇప్పుడు జూదశాలలపైనా..

ముందుగా పట్టణంలోనే కాకుండా ఇతర ప్రాంతాలలో గంజాయి అమ్మకాలు, అక్రమ రవాణాపై ఎస్పీ ఆదేశాలమేరకు పోలీసులు ఉక్కుపాదం మోపారు. దీంతో రోజూ ఎక్కడో ఒకచోట గంజాయి అమ్మకం దారులు, రవాణాదారులు పట్టుబడుతునే ఉన్నారు. ఇప్పుడు తాజాగా ఎంతోకాలంగా నిర్వహించబడుతుందని ఆరోపణలు వినిపిస్తున్న ఓ జూదశాలపైనా పోలీసులు పక్కా సమా చారంతో దాడులు చేయడం కలకలం సృష్టించింది. నిర్వాహకులు ఎంత పలుకుబడి వున్నవారైనా ఆలోచించకుండా దాడి చేయడంతోపాటు భారీ ఎత్తున జరుగుతున్న జూదాన్ని బట్టబయలు చేసి శభాష్ పోలీస్ అని పట్టణ వాసులు అనేలా చేసారు.

పోలీస్ అధికారులకు, సిబ్బందికి రివార్డులు

పట్టణంలోని సుజాత ఫంక్షన్ హాల్‌లో జరుగుతున్న జూదశాల నిర్వహణను ఎంతో చాకచక్యంగా పక్కా ప్లానింగ్‌తో దాడి చేసి పట్టుకున్న విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావును, టూటౌన్ సిఐ టి.శ్రీనివాసరావును, ఎస్ఐ ఎం.కృష్ణమూర్తిని, ఎఎస్ఐబి. గౌరినాయుడుతోపాటు ఇతర సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు. అలాగే వారికి ప్రశంసా పత్రాలను అందజేసారు. వీటితో పాటు పట్టణ ప్రజల అభినందనలు కూడా పోలీసులు పొందారని చెప్పవచ్చు.

మత్తు రహిత సమాజానికపై విద్యార్థులు సహకరించాలి

డీఎస్పీ శ్రీనివాసరావు

విశాలాంధ్ర-బొబ్బిలి: సంకల్పం (ఫైట్ ఎగైన్స్ట్ డ్రగ్స్ యూసేజ్) అనే మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణం కోసం జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వకుల్ జిందాల్ ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోనీ రాజా కళాశాలలో విద్యార్థులకు సబ్ డివిజనల్ పోలీస్ అధికారి,శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సంకల్ప అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ అవగాహన సదస్సుకు విద్యార్థిని విద్యార్థుల నుండి విశేషస్పందన లభించింది.ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు నైతిక విలువలతో కూడిన విద్య పై ప్రత్యేక దృష్టి సారించాలని ఉన్నత చదువుతూ మంచి ఉద్యోగాలు సాధించి సమాజానికి కుటుంబానికి మంచి పేరు తీసుకురావాలని మత్తు పదార్థాల జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని విద్యార్థులకు హితవు పలికారు.మత్తు పదార్థాల వినియోగం వలన వచ్చే అనర్థాలు ప్రమాదాలు పై అవగాహన కల్పించారు.. దీంట్లో భాగంగా ఫిర్యాదులను తెలియజేసే సంకల్పం డ్రాప్ బాక్స్ ను కూడా కళాశాలలో ఏర్పాటు చేశారు. విద్యార్థులు డ్రగ్స్ కి దూరంగా ఉండాలని, డ్రగ్స్ వాడే వారి సమాచారం ఇచ్చి పోలీసు వారికి సహకరించాలని పట్టణ సిఐ సతీష్ కుమార్ విద్యార్థులను కోరారు. కాలేజీలో యాంటి డ్రగ్స్ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సిఐ సతీష్‌కుమార్ మత్తు పదార్థాల జోలికి వెళ్ళబోమని ప్రతిజ్ఞ చేయించారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర- రామభద్రపురం: గ్రామాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల పరిషత్ అధ్యక్షులు లక్ష్మణరావు సర్పంచులను ఎంపీటీసీలను అధికారులనుకోరారు. శనివారము మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు ఎంపిటిసి లకు గ్రామాలలో జరిగే అభివృద్ధి పనులపై ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఏ ఏ పనులకు ఎంత నిధులు వెచ్చించాలో ఆ పనులకు సంబంధించి నిధులను వెచ్చించాలని అన్నారు. ఎంపీడీవో రత్నం మాట్లాడుతూ ముఖ్యంగా త్రాగునీరు, సానిటేషన్ అభివృద్ధి వంటి పనులపై దృష్టి పెట్టి గ్రామాలను త్వరితన అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈఓపి డి వెంకటరమణ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బంగార్రాజు రూ.3లక్షలు వితరణ

విశాలాంధ్ర-భోగాపురం: మండలం లింగాలవలస గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం నిర్మాణానికి ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు మూడు లక్షలు రూపాయలు విరాళం అందించారు. ఈ విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ బుగత రామ్మోహన్, ఓదూరి నరసింహులు,బోణి లక్ష్మినాయుడు తదితరులకు అందజేశారు.

ఫేకర్ సంస్థ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ లో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-గరివిడి: పట్టణంలో ఉన్నా ఫేకర్ సంస్థ ఆధ్వర్యంలో ఉన్న ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్ లో చీపురుపల్లి సివిల్ జడ్జి వై ప్రేమలత ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. సుమారు 100 వినికిడి లోపం కలిగిన విద్యార్థులకి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ తిరుపతి రావు, ఎంఎస్ ఆప్తాలజీ డాక్టర్ తాజ్‌కుమార్, ఎంఎస్ ఆర్థో డాక్టర్ హెచ్‌వి కృష్ణంనాయుడు, ఎంఎస్ ఈఎన్టి కె రాజ్యలక్ష్మి ,మెడికల్ ఆఫీసర్,గరివిడి పిహెచ్సి ఇబ్బంది, ఫేకర్ సిఈ ఎమ్ఎస్ఎస్ శర, సంస్థ వైస్ ప్రెసిడెంట్ జి రామకృష్ణ,లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గోపాల్ రాజు, సివిల్ వేణు,లయన్స్ మెంబెర్స్,సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికుల సంతృప్తి లక్ష్యంగా ప్రయాణం

విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్: ప్రయాణికుల సంతృప్తి లక్ష్యంగా బస్సు ప్రయాణం ఉండాలని శృంగవరపుకోట ఆర్టీసీ డిపో మేనేజర్ కే రమేష్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏపీఎస్ ఆర్టీసీలో నిర్వహిస్తున్న సమయపాలన మాసోత్సవాలలో భాగంగా శనివారం స్థానిక డిపో వద్ద డిపో మేనేజర్ కె రమేష్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. బస్సులను పరిశుభ్రంగా మంచి కండిషన్ గా తయారు చేసి ప్రయాణీకులకు సంతృప్తి కలిగే విధంగా మెయింటనెన్స్ చేయాలన్నారు. ఈ కార్యక్రమం భాగంగా సిబ్బందిని సమావేశ పరచి బస్సు లను బాగా తయారు చేసి డ్రైవర్ మరియు కండక్టర్ లు సమయపాలన పాటిస్తూ ప్రయాణికుల మన్ననలు పొందాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్, గారేజ్, సెక్యూరిటీ సిబ్బంది, డ్రైవర్లు మరియు కండక్టర్లు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ అపార్ ఐ.డి లు జారీ చేయాలి

కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర-విజయనగరం: ఈ నెల 20 లోపల 1 నుండి 12 వ తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ అపార్ ఐ.డి లు జెనరేట్ చేయాలనీ జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. అప్పార్ ఐ.డిలు జేనరేట్ చేయడం లో ఆధార్ లో పుట్టిన తేదీ లో తేడాలను సరిదిద్దడానికి వెంటనే అదాఆధార్ కేంద్రాలకు వెళ్ళాలని సూచించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్లో ఏక్షన్ టేకెన్ రిపోర్ట్ పై విద్యాశాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అపార్ ఐ.డి. రిజిస్ట్రేషన్లు ఇంతవరకు స్కూల్ ఎడ్యుకేషన్‌లో 75శాతం, ఇంటర్మీడియట్ విద్య లో 35 శాతం, ఐ.టి.ఐ లలో 80 శాతం పూర్తి చేసినట్లు ఆయా అధికారులు కలెక్టర్ కు తెలిపారు. ఆధార్ లో తలెత్తిన సాంకేతిక సమస్య వలన మిగిలినవి పూర్తి కాలేదని తెలిపారు. ఆధార్ సమస్యను పరిష్కరించుకొని వెంటనే అపార్ ఐ.డి లను జారీ చేయాలనీ కలెక్టర్ సూచించారు. ఏఏ కార్యక్రమాలు నెలలో ఎన్నెన్ని జరుపుతున్నారో నివేదికలి లని డి.ఈ.ఓ ను కోరారు. పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వహిం చడం, విద్యార్థుల మధ్యపోటీలు నిర్వహించడం వంటివి రెగ్యులర్ గా జరగాలని వాటి వివరాలను కూడా సమర్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో సి.పి.ఓ బాలాజీ, డి.ఈ.ఓ మాణిక్యంనాయుడు, ఐ.టి.ఐ, పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు, ఆర్.ఐ.ఓ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ సైనికస్కూల్ లో వసతులు పరిశీలించిన జెసి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : కోరుకొండ సైనిక స్కూల్ ను జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ శనివారం సందర్శించారు. అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలను పరిశీలించారు. సైనిక పాఠశాలలోని డార్మిటరీ, మరుగుదొడ్లు, వంటగది, స్టడీ రూంలు, ఇతర వసతులను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, పారిశుద్ధ్య పరిస్థితులు తగిన నాణ్యత ప్రమాణాలతో వున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై సైనిక అధికారులు జె.సి.కి వివరించారు. విద్యార్థులకు వసతుల విషయంలో ఎలాంటి లోటు లేకుండా చూస్తున్నామని, సిబ్బంది కొరత వున్నప్పటికీ ఆ లోటు కనిపించకుండా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. అక్కడ విద్యార్థులకు కల్పిస్తున్న వసతులపై జాయింట్ కలెక్టర్ సంతృప్తి వ్యక్తంచేశారు. పర్యటనలో జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటరమణ కూడా పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా గ్రామపంచాయతీల అభివృద్ధి

ఎంపిపి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-లక్కవరపుకోట: గ్రామపంచాయతీలు అభివృద్ధి చెందాలి అంటే ప్రణాళికలు అవసరమని ఎంపిపి గేదెల శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఎంపిడిఓ ఎస్. అప్పారావు ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సచివాలయ సిబ్బంది కి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక శిక్షణా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ. ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో ప్రధానంగా విద్య, మొక్కలు నాటడం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు నిర్మాణం, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, రోడ్ల నిర్మాణం తదితర ప్రధానమైనటువంటి అంశాలు గుర్తించి ప్రణాళికల రూపొందించుకొని ప్రభుత్వం ద్వారా నిధులు రాబట్టుకొని అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఈవో అండ్ పిఆర్డి కుమార్, ఎంఈఓ సిహెచ్ కూర్మారావు, ఉపాధి హామీ ఏపీవో ఎం విజయలక్ష్మి, తదితర మండల స్థాయి అధికారులు బ్రామాయక సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు,

జీవితం విలువ తెలుసుకోండి : బూరాడ శివకృష్ణ

విశాలాంధ్ర-రాజాం: రాజాం పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎంపీపీ పాఠశాలలో, రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్, ప్రిన్సిపల్ విజయలక్ష్మి, శ్రీను మాస్టర్ ఆధ్వర్యంలో, విద్యార్థులతో శివకృష్ణ ప్రసంగిస్తూ, బాల్యంనుండే జీవితం యొక్క విలువ తెలుసుకుని సంతోషంగా జీవించాలని, ఎల్లవేళలా మంచి విషయాలను తెలుసుకుంటూ, చెడు విషయాలను దూరం పెట్టాలన్న స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని, లేకపోతే చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కొన్ని సందర్భాలలో జీవితమే కోల్పోయే ప్రమాదం ఉందని చెప్పారు. చెడు స్నేహాలు, చెడు ఆలోచనలు, చెడు అలవాట్లు, మనిషి జీవితాన్ని నాశనం చేసి, సంతోషాన్ని దూరం చేసి దుఃఖానికి కారణం అవుతాయి కాబట్టి ప్రతీ ఒక్కరూ జీవితం విలువ తెలుసుకుని, ఎల్లప్పుడూ సన్మార్గంలో నడుస్తూ గొప్ప గొప్ప ఆలోచనలు ఆశయాలు ఆచరణ కలిగి ఉండి ఆదర్శవంతమైన ఆనందకరమైన జీవితాన్ని గడపాలని తెలియచేశారు.

తూర్పు కాపు సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ యశస్విని కి అభినందనలు

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తూర్పు కాపు సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గా నియామకమైన పాలవలస యశస్విని కి విజయనగరం జిల్లా జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో శనివారం ఐఎంఏ హాల్లో అభినందనలు తెలియజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో జనసేన పార్టీ లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , విజయనగరం నియోజకవర్గ ఇన్చార్జి గా విశేష సేవలు అందించి, ఉన్నత విద్యావంతురాలుగా పేరొందిన పాలవలస యశస్విని తూర్పు కాపు చైర్మన్ రావటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు ఆయా వర్గాలకు అందించడంలో పార్టీలకు అతీతంగా అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తొలుత పాలవలస యశస్వినికి శాలువాకప్పి పూలదండలు వేసి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి నాయుడు, ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, కొండ బాబు, కొండపల్లి భాస్కర నాయుడు, అవనాపు విక్రమ్, గురాన అయ్యలు, ఐవీపీ రాజు, కంది మురళి నాయుడు, పడాల అరుణ, రెడ్డి పావని, బూర్లే శ్రీదర్, తుమ్మి లక్ష్మీ రాజ్ , విసినిగిరి శ్రీనివాసరావు, ఇమంది సుదీర్, పిల్లా విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డెంకాడలో సీసీ కెమెరాలు

విశాలాంధ్ర-డెంకాడ: వివిధ నేరాలు దొంగతనాలు యాక్సిడెంట్ తదితర వివరాలు గుర్తింపులో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు భోగాపురం సిఐ రామకృష్ణ ఆధ్వర్యంలోడెంకాడ ఎస్సై సన్యాసినాయుడు వారి సిబ్బందితో కలిసి శనివారం డెంకాడ గ్రామములో చాపల ఖానా వద్ద రోడ్డుకి ఇరువైపులా కవర్ అయ్యే విధముగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

సత్య డిగ్రీ& పీజీ కళాశాల విద్యార్థి కి సెంట్రల్ కానిస్టేబుల్ ఉద్యోగం

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : సత్య డిగ్రీ & పీజీ కళాశాల విద్యార్థి ఎం. ప్రమీల కు మొట్టమొదటి ప్రయత్నం లోనే ఎస్ఎస్‌సిజిడి కానిస్టేబుల్ పరీక్ష వ్రాసి, విశాఖపట్నం సిఆర్‌పిఎఫ్ యూనిట్ లో 1600 మీటర్ల ఈవెంట్ లో మెరిట్ పొంది సెంట్రల్ కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సంపాదించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవమణి తెలియజేశారు. ఈ అమ్మాయి సత్య కళాశాల లో ఎన్ సి సి లో సి సర్టిఫికెట్ విద్యార్థి. ఈ సందర్భంగా కళాశాల లో ఏర్పాటు చేసిన అభినందన సభ లో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదలతో వుంటే ఏ విషయమైనా సొంతం చేసుకోవచ్చన్నారు . ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, ఎం ఉదయ్ కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి సూరపు నాయుడు, ఎన్ సి సి కెడేట్ లు పాల్గన్నారు.

విశాలాంధ్ర-డెంకాడ: డెంకాడ మండలం లో 2025-26 సం గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయుటకు మండలం అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్ లు,వి ఓ ఏ లకి మండలపరిషత్ కార్యాలయం, వెలుగు మీటింగ్ హల్ లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు వైసీపీ పిన్ని తమ్మి నాయుడు పాల్గొన్నారు జిల్లా నుండి ఎం ఓ టి మరియు అబ్జర్వర్ మహమ్మద్ రఫీ హాజరు అయినారు ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డి శ్రీనివాస్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులకు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా శనివారం కే.ఎల్.పురం వద్దనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అయితే ఆ కేంద్రానికి వెళ్లేందుకు సరైన రహదారి, చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడం వంటి సమస్యలను ఆయన గుర్తించారు. ఆసుపత్రికి కావలసిన సదుపాయాలను వెంటనే కల్పించాలని అందుకు తగ్గ అంచనాలను రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం నగరంలో పలు ప్రాంతాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో నిర్మాణం చేపట్టిన సీసీ కాలువలపైనే కొంతమంది గృహస్తులు ర్యాంపులు వేసుకొని పూర్తిగా కాలువలను కప్పివేశారు. దీన్ని గమనించిన కమిషనర్ పల్లి నల్లనయ్య సదరు గృహస్థుల పై మండిపడ్డారు. తక్షణమే ర్యాంపులను తొలగించాలని లేనిచో తమ సిబ్బంది తొలగించి వేస్తారని చెప్పారు. అనంతరం ఉడా కాలనీలో ఉన్న పార్కును పరిశీలించారు. టిఫిన్ దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వినియోగాన్ని గమనించి వారిని మందలిస్తూ వాటిని స్వాధీనం చేసుకొని అపరాధ రుసుంలను విధించారు.

17న రాజీవ్ మైదానంలో మాస్టర్ అథ్లెటిక్స్ ఎంపికలు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : వచ్చేనెల 14, 15వ తేదీల్లో కృష్ణాజిల్లా గుడివాడలో ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి మాస్టర్ ఛాంపియన్షిప్ క్రీడా పోటీలు జరగనున్నాయని అందులో పాల్గొనే జిల్లా జట్లకు సంబంధించి ఈ నెల 17న రాజీవ్ మైదానంలో జిల్లా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మాస్టర్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుకూరి రఘు రాజు ,కార్యదర్శి వి. కృష్ణ తెలిపారు .30 సంవత్సరాలు పైబడిన పురుషులు, మహిళలు అర్హులని ఇతర వివరాలకు 984958449, 98 49086080 నంబర్లకు సంప్రదించాన్నారు.

అపార్ ఐడి నమోదు శతశాతం జరిగాలి : నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : ఒక విద్యార్థి-ఒక దేశం అనే నినాదంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన అపార్ ఐడి నమోదు ప్రక్రియ శత శాతం జరిగే విధంగా చూడాలని సిబ్బందికి విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. ఈ మేరకు ఐడి నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేసేలా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు కళాశాల ప్రిన్సిపాల్ను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించా మని పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ప్రతి విద్యార్థి అపార్ ఐడి వివరాలను యుడైస్ ప్లస్ లో నిక్షిప్తం చేయాలన్నారు. విద్యార్థులందరికీ తప్పనిసరిగా అపార్ ఐడి ఉండాలన్నారు. రాబోయే కాలంలో ఈ ఐడీకి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళుతుందన్నారు. ఈ క్రమంలో విద్యార్థుల విద్యార్హత విద్యపై సమగ్ర వివరాలు సేకరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచించిన వెబ్ సైట్ లోని వివరాలు నిక్షిప్తం చేయాలన్నారు. విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పాఠశాలల యాజమాన్యం, కళాశాలల విద్యార్థులు అపార్ ఐడిని శతశాతం పూర్తి చేయాలని సూచించామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలన్నారు. ఆధార్లో తప్పొప్పులు ఉంటే వాటిని సరిచేసుకుని అపార్ ఐడిని నమోదు చేసి ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. అలాగే జనన ధ్రువీకరణ పత్రాల జారీని కూడా త్వరితగతిన చేపట్టాలని సూచించామన్నారు.

లచ్చయ్యపేట అల్లాడ సత్యారావు నేత్రదానం

కుటుంబ సభ్యులను అభినందించిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు



విశాలాంధ్ర-రాజాం: శనివారం లచ్చయ్యపేట మొదటి వీధికి చెందిన అల్లాడ సత్యారావు 50 సంవత్సరాలు వయస్సు వ్యక్తి సాధారణంగా మరణించారు. కుటుంబ సభ్యులు కుమారులు సాయి, ప్రకాష్, జగదీశ్వరరావు, నేత్రదానం చేయడానికి బింగి రంగనాథం ద్వారా సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే రెడ్ క్రాస్ శ్రీకాకుళం కళ్యాణ్ మగటపల్లి నేత్ర సేకరణ కేంద్రం ద్వారా టెక్నీషియన్ సుజాత, ఉమాశంకర్ వచ్చి సత్యారావు దగ్గర కార్నియాలు సేకరించారు. రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు రెడ్ క్రాస్ ద్వారా సుమారుగా 500 మంది చనిపోయిన వారి నుండి నేత్రాలను సేకరించి 980 మందికి చూపును ప్రసాదించారన్నారు. నేత్రదానం కుటుంబ సంప్రదాయం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పెద్దలు లచ్చయ్యపేట గ్రామ ప్రజలు పాల్గొన్నారు. రాజాం ప్రాంతంలో ఎవరైనా నేత్రదానం చేయాలి అనుకుంటే కొత్తా సాయిప్రశాంత్ కుమార్ 9440131160, పెంకి చైతన్య కుమార్ 9441708120 లను సంప్రదించగలరు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



విశాలాంధ్ర -రామభద్రపురం: గ్రామంలో ఉన్న భూ సమస్యలను పరిష్క రించడానికి ప్రభుత్వము ఈ రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని తాసిల్దార్ సులోచన రాణి అన్నారు. శనివారము కొండకింగు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గ్రామంలో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తామని ఆమె తెలిపారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కారం చేసే రైతులకు న్యాయం చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యదర్శి గ్రామస్తులు పాల్గొన్నారు.

67 పోలింగ్ బూత్‌లకు కమిటీల నియామకంపై చర్చ



విశాలాంధ్ర-శృంగవరపుకోట టౌన్: మండలంలో ఉన్న 67 పోలింగ్ బూతులకు కమిటీల నియామకంపై చర్చ నిర్వహించామని విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి శ్రీరంగ దానేష్ తెలిపారు. పట్టణంలో ఉన్న ఒక ప్రైవేటు హాల్లో భారతీయ జనతా పార్టీ ఎస్.కోట మండల ముఖ్య నాయకుల సమావేశం దాశెట్టి దాశరధి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి శృంగవరపుకోట నియోజకవర్గ ఇన్చార్జ్ శ్రీరంగ దానేష్ తోపాటు ఎస్ కోట మండలం రిటర్నింగ్ ఆఫీసర్ వారాధి చిరంజీవి పాల్గొన్నారు.

పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలు

జిల్లా పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరక్టర్ రమేష్

విశాలాంధ్ర -విజయనగరం టౌన్: పత్రికలు ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మ లని జిల్లా పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరక్టర్ రమేష్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ఆధ్వర్యంలో గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన జాతీయ పత్రికా దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ సమాజానికి దిశా నిర్దేశం చేయడంలో పత్రికలు అద్వితీయ పాత్రను పోషిస్తాయని అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.జయచంద్రనాయుడు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటే ఉన్నత లక్ష్యాలను అధిగమించ వచ్చన్నారు. జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2024 సంవత్సరానికి గాను ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం పురస్కారాన్ని సీనియర్ పాత్రికేయులు విశాఖ టుడే సంపాదకులు సూరె మహేష్‌కు జిల్లా పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరక్టర్ రమేష్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం జయచంద్రనాయుడులతో కలసి సంఘం అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ ప్రదానం చేసారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి లక్ష్మీ, గ్రంథాలయసంఘం కార్యదర్శి ఎం సుభద్రాదేవి, మహిళావిభాగం కార్యదర్శి గిరిజా ప్రసన్న, పులిపాటి రామారావు, గీతాంజలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలలకు చెందిన వంద మంది విద్యార్థులకు ఉత్తమ విద్యార్థి పురస్కారాలను, పతకాలను ప్రదానం చేసారు.

జర్నలిస్టులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

ఎంపీపీ పొట్నూరు సూచన

విశాలాంధ్ర-గుర్ల: ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరచడంలో భాగంగా పత్రికలు నైతికపరమైన, న్యాయమైన, బాధ్యత యుతమైన కార్యకలాపాలు చేపట్టాలని ఎంపీపీ పొట్నూరు ప్రమీల-సన్యాసినాయుడు సూచించారు. కొందరు ప్రయోజనాలకోసం కాక వ్యవస్థలను పటిష్టపరిచి ప్రజలకు ఉపయోగపడేలా వార్తలు ఇవ్వాలన్నారు జాతీయ పత్రిక దినోత్సవం పురస్కరించుకొని వారు మీడియా ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు. పత్రిక స్వేచ్ఛ అనేది పదిమందికి ఉపయో గపడేలా ఉండాల తప్ప నచ్చిన రాతలతో తనదైన భాష్యం చెప్పడానికి కాదన్నారు.

ఘనంగా జాతీయ పత్రికా దినోత్సవం

పిడబ్ల్యూజె డబ్ల్యూ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా గోవింద ప్రకాష్ శర్మ, ఎం ధర్మారావు

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్ : పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని కాపు సోంపురం నుండి దబ్బగుంటకు వెళ్లే రహదారిలో గల ఏ ఎస్ ఆర్ గార్డెన్ లో అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల వన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుణ్యగిరి వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా గోవింద ప్రకాష్ శర్మ, ఉపాధ్యక్షుడిగా గనివాడ బాపు నాయుడు, కార్యదర్శిగా ముగ్గు ధర్మారావు, సహాయ కార్యదర్శులుగా మోపాడ బోగయ్య నాయుడు, హను మాల శెట్టి నానాజీ, కోశాధికారిగా బాలనాగుల శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులుగా చిప్పాడ రమణ, వసంత కృష్ణ, శేఖర్, జె.శ్రీని వాసరావు, సురేష్ రాజు, వెంకట రమణమూర్తి, సన్నీ బాబు, శంకర్, సన్యాసిరావు తదితరులు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు గోవింద ప్రకాష్ శర్మ మాట్లాడుతూ. ప్రభుత్వం ద్వారా జర్నలిస్టులకు వచ్చే పథకాలు అందేలా జర్నలిస్టుల సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తానని అన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు పాల్గొన్నారు.

సర్ సి.వై.చింతామణి విగ్రహానికి ఘన నివాళులు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక అంబటిసత్రం వద్దగల గురజాడ ప్రెస్‌క్లబ్ వద్ద ఏపియుడబ్ల్యూజే ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. రాష్ట్ర కార్యదర్శి పి.ఎస్.ఎస్.వి ప్రసాద్ (శివ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్,ప్రముఖ సంఘసంస్కర్త కుసుమంచి సుబ్బారావు ముఖ్యఅతిథి గా హాజరైనారు.ఈ సందర్భంగా తొలుత ప్రెస్ క్లబ్ ఆవరణలో సర్ సి.వై.చింతామణి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.తరువాత జరిగిన సమావేశంలో సుబ్బారావు తో పాటు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు వి.మహాపాత్రో, చిన్న పత్రికల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.జె.శర్మ, సముద్రాల నాగరాజు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పంచాది అప్పారావు, దేవిడ్ రాజు,రవి, భరద్వాజ చక్రవర్తి, సూర్య పాత్రో,గొట్టాపు త్రినాధ్, శంకరరావు పాల్గొన్నారు.

సంఘ గ్రేడింగ్ స్థాయిని బట్టి భవిష్యత్తులో చేపట్టబోయే ఆర్థిక కార్యక్రమాల ప్రక్రియ

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ విజయనగర వ్యాప్తంగా 5,432 సంఘాలు, 195 స్వయం సహాయక సంఘాల గ్రూప్ లతో 56,672 మంది పేద మహిళలను సంఘటితం చేసి వారి సామాజిక ఆర్థిక సాధికారత కొరకు కృషి చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సంఘాలు సమైఖ్యల కార్యకలాపాలు పూర్తిస్థాయి పారదర్శకంగా నిర్వహించి తద్వారా సంఘ సభ్యుల ఆర్థిక వికాసానికి తోడ్పడేటందుకు స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ అనే ప్రక్రియను మెప్మా సంస్థ చేపట్టడమైందని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటన ద్వారా తెలిపారు. దీనిలో స్వయం సహాయక సంఘాలు, సంఘ సభ్యుల సమగ్ర సమాచారాన్ని ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ అప్లికేషన్ ద్వారా సేకరించి నాలుగు స్థాయిలలో సంబంధిత సిబ్బంది చేత తనిఖీ చేసి వాస్తవ సమాచారాన్ని సేకరించేలా ప్రణాళిక చేయడమైనదని తెలిపారు. సంఘాల నిర్వహణా స్థితి పొదుపులు అప్పులు, చెల్లింపులు బకాయిలు అడ్వాన్సులు వంటి ఆర్థిక అంశాలతో పాటు సంఘస్థాయిలో చేపడుతున్న జీవనోపాదుల వివరాలను తెలుసుకోవడం ద్వారా సంఘం ప్రస్తుత స్థితిని బట్టి గ్రేడింగ్ ఇవ్వబడు తుందని తెలిపారు. సంఘ గ్రేడింగ్ స్థాయిని బట్టి వాటికి భవిష్యత్తులో చేపట్టబోయే ఆర్థిక కార్యక్రమాలను నిర్దేశించుటకు తగు చర్యలు తీసుకోబడునని తెలిపారు. సభ్యుల స్థాయిలో వారి ఆర్థిక సామాజిక అంశాలతో పాటు జీవనోపాధి వివరాలు మరియు ఆదాయ వివరాలను సేకరించి తద్వారా ఆదాయ స్థితిగతుల ఆధారంగా ప్రతి ఒక్క సభ్యురాలి కుటుంబం మరియు మెరుగైన ఆదాయం సముపార్జించేలా ప్రణాళికలు రూపొందించడమైనదని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించినట్లు ప్రతి కుటుంబం ఒక ఔత్సాహిక వ్యాపారస్తులు అనే అంశంలో భాగంగా ప్రతి సంఘ సభ్యురాలని వారి ఆర్థిక పరిస్థితిని బట్టి వర్గీకరించి తక్కువ స్థాయిలో ఆదాయం ఉన్న సభ్యులకు తక్షణం వారి నైపుణ్యం మెరుగుదల చేసి వారి సామర్థ్యం ఆధారంగా మరింత మెరుగైన ఉపాధి ద్వారా ఆదాయం సంపాదించేలా చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. అలాగే అత్యున్నత స్థాయిలో వ్యాపారాలు చేస్తున్న సంఘ సభ్యులను గుర్తించి వారిని ఎంఎస్ఎంఇ పాలసీలో నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పరిశ్రమలను ప్రారంభించేలా సంబంధిత శాఖల సమన్వయంతో తగు చర్యలు తీసుకోబడతాయని వివరించారు. స్వయం సహాయ సంఘాల ప్రొఫైలింగ్ అనేది సంఘాల సభ్యుల మధ్య పారదర్శకతను పెంపొందించి ప్రతి సంఘ సభ్యురాలు లేదా సభ్యుడు వారి వారి సామర్థ్యం నైపుణ్యం ఆధారంగా మరింత మెరుగైన స్థితికి చేరేలా చేయుటకు నిర్దేశించిన అద్భుతమైన టూల్ అని వెల్లడించారు. దీని ద్వారా కేంద్ర రాష్ట్ర పథకాల అమలులో కచ్చితత్వం తీసుకొచ్చి పేదరిక నిర్మూలనకు బాటలు వేసి జీరో ప్రాపర్టీ లక్ష్యాన్ని సాధించడానికి స్వయం సహాయక సంఘాల ప్రొఫైలింగ్ మొదటి మెట్టుగా పనిచేస్తున్నామని తెలిపారు. ఈ నెలాఖరు వరకు నగరవ్యాప్తంగా రిసోర్స్ పర్సన్ లతో సమాచారం సేకరించి డిసెంబర్ నెలలో డేటా వ్యాలిడేషన్ ను పూర్తి చేస్తామని పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు.

అత్యవసర సమయంలో వినియోగించే సిపిఆర్ విధానంపై శిక్షణ



విశాలాంధ్ర -జామి: అత్యవసర సమయంలో వినియోగించే సిపిఆర్ విదానంపై శనివారం మండలంలోని భీమసింగిలో ఉన్న శ్రీబాలాజీ కళాశాల లో విద్యార్థులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. విజయ నగరం మెడికవర్ ఆసుపత్రి ఎండి డా. తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ ఎంసి మెంబర్ బాల మురళి సహకారంతో ఈశిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. డా.షరీన్‌భట్, అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్ కె. వెంకటసాయి, ఎమర్జన్సీ మెడికల్ టెక్నీషియన్ జి.దుర్గారావులు సిపిఆర్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. రోగులు అపస్మారకస్థితిలో ఉన్నప్పుడు, గుండె పోటు వచ్చినప్పుడు ఏవిదంగా సిపిఆర్ చేయాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటువంటి మంచి కార్యక్రమాన్ని తమ కళాశాలలో ఏర్పాటు చేసినందుకు కళాశాల యాజమాన్యం కొత్తలి సూర్యారావు, ప్రిన్సిపాల్స్ ఎస్.సురేష్, లక్ష్మణరావులు ఆసుపత్రి యాజమాన్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీ ప్రణాళికల అమలుపై శిక్షణ



విశాలాంధ్ర-జామి: మండలంలోని అన్ని పంచాయతీల 2025-26 ఆర్థిక ఏడాదికి సంభందించిన యాక్షన్ ప్లాన్ అమలుపై శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడివో నీలం అప్పలనాయుడు, ఇవోపిఆర్‌డి ఉమాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి జెడ్‌పిటిసి గొర్లె సరయు, ఎంపిపి ఎస్.అరుణతోపాటు ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిద శాఖల మండల అధికారులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా జిపిడిపి,బిపిడిపిల ప్రణాళికలపై అవగాహన కల్పించారు. ఈశిక్షణలో పరిశీలకులు శివరావు, ఇవో నరసింహం పాల్గొన్నారు.

పంచాయితీల అభివృద్ధి ప్రణాళిక పై శిక్షణ

ఎంపీడీవో భాస్కరరావు

విశాలాంధ్ర-మెరకముడిదాం: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల అభివృద్ధి అధికారి జి భాస్కర రావు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక (జిపిడిపి) పై సర్పంచులకు ఎంపీటీసీలకు గ్రామైక్య సంఘ సభ్యులకు సచివాలయ సిబ్బందికి ఉదయం నుండి సాయంత్రం వరకు శిక్షణా కార్యక్రమం జరిగింది. 2025 -26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ శాఖల సమన్వయంతో గ్రామ సభల్లో పనులు గుర్తించి, ప్రణాళికలు రూపొందించి, ఆమోదం పొందాల్సి ఉంటుందని ఎంపీడీవో జి భాస్కరరావు పేర్కొన్నారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు విడుదల చేసిన నిధులను సద్వినియోగం చేసుకొని పంచాయతీ పనుల ద్వారా అభివృద్ధి చేపట్టాలని అన్నారు. పంచాయతీకి వచ్చే ఆర్థిక సంఘం జనరల్, జల్ జీవన్ మిషన్ ఎంపీడీవో నిధులతో గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకోవల్లాన్నారు దేనికి ఏ నిధులు ఖర్చు పెడుతున్నారు రికార్డుల్లో పొందు పరచాలన్నారు. గ్రామాల్లో చేపడుతున్న వివరాలు బిల్లులు వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో పొందుపరచాలని తెలియపరిచారు. శిక్షణలో 10 శాఖలకు సంబంధించిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంపీటీసీలు సర్పంచులు, గ్రామ సమైక్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతంకు కృషి చేయాలి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎల్ఎన్‌టి శ్రీనివాస్ వెల్లడి



విశాలాంధ్ర-మెంటాడ: రాష్ట్రంలోరెండు వేల సహకార సంఘాలకు గాను కేవలం 80సంఘాలు లాభాల బాటలో నడుస్తున్నాయని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాల కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్ ఎల్ ఎన్ టి శ్రీనివాస్ తెలిపారు.శనివారం మెంటాడ ప్రాథమిక సహకార పరపతి సంఘం ప్రాంగణంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ కో ఆపరేటివ్ మేనేజ్ మెంట్ హైదరాబాద్ సహకార సే సమృద్ధి యోజన అధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంధర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కమర్షియల్ బ్యాంకు లకు దీటుగా సొసైటీ లను ఆన్ లైన్ ద్వారా ఆర్థిక లావాదేవీలు జరిగే విధంగా కంప్యూటరైజింగ్ పద్ధతిని అవలంభించడం జరుగుతుందన్నారు.గతంలో సహకార సంఘాలు రాష్ట్రప్రభుత్వం ఆధీనంలో నడిచేవి అని , ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అధీనంలోకి రావడం కేంద్ర హెూం మంత్రి అమిత్ షా నాయకత్వం లో పలురకాల వ్యాపార నిమిత్తం సంఘ సభ్యులు బలోపేతం చేసేందుకు నాబార్డ్ నిధులు వెచ్చించడం జరుగుతుందన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో సొసైటీ లకు కామన్ సర్వీస్ పోర్టల్ సేవలు ద్వారా ఆదాయం సమకూర్చడం జరుగుతుందన్నారు.పాలక వర్గం లోపం, సొసైటీ సభ్యులు భాగస్వామ్యం లోపం , సిబ్బంది పనితీరులో లోపం, అధికారులు సొసైటీల పట్ల పర్యవేక్షణ లోపం వల్ల సొసైటీలు నష్టాల బాటలో నడుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.ఉమ్మడిగా ఆంధ్రప్రదేశ్ లో1950,60దశకాలలో 42వేల సహకార సంఘాలు వుండేవి, కాలక్రమేణా తెలుగు రాష్ట్రాలు విడిపోయే సమయానికి ఆంధ్రప్రదేశ్ లో రెండువేల సంఘాలు, తెలంగాణ లో వెయ్యి సంఘాలు వున్నాయని, దీనినిబట్టి చూస్తే సహకార వ్యవస్థ ఎంతగానో నిర్వీర్యం అయ్యిందో అర్థం చేసుకోవచ్చునని ఆయన చెప్పారు.సొసైటీలలో వ్యక్తిగత రుణాలు మంజూరు చేయడానికి పలురకాల నియమ నిభందనలు పెట్టడం, కమర్షియల్ బ్యాంకు లలో రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని రైతు నాళం ప్రసాదరావు , సిబ్బంది కి తారతమ్యం లేకుండా జీతభత్యాలు సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలని రైతు నీలాతి అప్పలనాయుడు, సహకార సంఘాలు ద్వారా రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని రైతు మండల తిరుపతి రావు సలహాలు సూచనలు అందజేసారు.ఈ కార్యక్రమం లో డి ఆర్ఓ ఎస్ డి ఎస్ రామ్మూర్తి, సొసైటీ సిఇఓ వి ప్రసాదరావు,చల్లపేట డిసిసిబి బ్యాంకు బ్రాంచి మేనేజర్ పొంద్రంకి శ్రీనివాసరావు, జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి గంద్రేటి అప్పలనాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు ముగడ లింగేశ్వర రావు, అరసాడ అక్కునాయుడు,వి సన్యాసిరావు,వి అప్పలస్వామి సిబ్బంది పి విశ్వేశ్వర రావు,పి చిరంజీవి లతో పాటు పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్స్ తో నేరాలకు చెక్ పెడుతున్న జిల్లా పోలీసులు : ఎస్పీ వకుల్ జిందల్



విశాలాంధ్ర-విజయనగరంటౌన్: జిల్లాలో నేరాలను నియంత్రించుటలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ను వినియోగిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు.జిల్లాలో నేరాలను నియంత్రించుటకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. ఇందులో భాగంగా ప్రతీ పోలీసు స్టేషను పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ప్రాంతాలు, కోడి పందాలు, పేకాటలు నిర్వహించేందుకు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను, నిశిత ప్రాంతాలను, తోటలు, బహిరంగ ప్రదేశాలను, పార్కులు, నదీ తీరాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి, నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్య కూడళ్ళలో ట్రాఫిక్ నియంత్రణ, మహిళలపై దాడులను నియంత్రించేందుకు, సుదూర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టేందుకు డ్రోన్స్ వినియోగించి, నేరాలను కట్టడి చేస్తున్నామని తెలిపారు. పట్టణంలోని జె.ఎన్.టి.యు., కలెక్టరేట్ జంక్షన్, కే.ఎల్. పురం, మయూరి కూడలి, ఆర్టీసి కాంప్లెక్స్, రైల్వే స్టేషను, ఆర్టీసి కాంప్లెక్స్, తోటపాలెం, బాలాజీ జంక్షన్ వంటి ప్రాంతాలను, కళాశాలల వద్దకు వన్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రోన్స్ పంపి, ఆయా ప్రాంతాలపై నిఘా ఏర్పాటు చేసామని ఈవ్ టీజింగు, చైన్ స్నాచింగ్స్, ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.అదే విధంగా, బొబ్బిలి పట్టణంలో రహదారి ప్రమాదాలు జరిగేందుకు అవకాశమున్న బ్లాక్ స్పాట్స్, ఇతర నేరాలైన చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, పేకాటలు, కోడి పందాలు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశమున్న ప్రాంతాలకు బొబ్బిలి పోలీసుల ఆధ్వర్యంలో డ్రోన్స్ ను పంపి, ఆయా ప్రదేశాలపై నిఘా ఏర్పాటు చేస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.వీటితోపాటు జిల్లా వ్యాప్తంగా ముఖ్య కూడళ్ళు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, షాపులు, కాలేజ్ లు, వాణిజ్య సముదాయాలు, ప్రధాన రహదారులపై సిసి కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటికి అదనంగా, మరిన్ని సిసి కెమెరాలను ఏర్పాటు చేసే విధంగా షాపు యజమానులకు, వ్యాపారవేత్తలకు, అపార్టుమెంటు వాసులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను నియోగించుకోవాలి



విశాలాంధ్ర-విజయనగరం రూరల్: జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ వెల్లడించారు. రైతులంతా తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించడం ద్వారా కనీస మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని మధ్య దళారులకు విక్రయించి మోసపోవద్దని కోరారు. ధాన్యం సేకరణ కేంద్రంలో ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లోనే రైతుల ఖాతాల్లోకి చెల్లింపులు చేయనున్నట్లు పేర్కొన్నారు. విజయనగరం రూరల్ మండలం జొన్నవలస రైతుసేవా కేంద్రంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ శనివారం ప్రారంభించారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఇప్పటికే వరికోతలు మొదలైనందున కొద్దిరోజుల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరే అవకాశం వుందని అందువల్ల ఇప్పటి నుంచే అన్ని ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్టు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ దశల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో 3.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. ధాన్యం విక్రయించినపుడు రైతులు ఎఫ్.టి.ఓ. అథంటికేషన్ చేయించుకోవాల్సి వుంటుందన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సంబంధించి పి.ఏ.సి.ఎస్.ల సిబ్బందికి ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ ఇచ్చామని, రైస్‌మిల్లర్లతో కూడా సమావేశం ఏర్పాటుచేసి వారి సహకారం కోరామన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మీనాకుమారి, డి.ఎస్.ఓ. మదుసూధన్ రావు, వ్యవసాయ శాఖ జె.డి. వి.టి.రామారావు, జిల్లా సహకార అధికారి పి.రమేష్, పూసపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు కరపత్రాల ఆవిష్కరణ



విశాలాంధ్ర-రాజాం: రాజాం నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో పార్టీ ఇన్చార్జ్ బొత్స బుద్ధుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినాదంతో, ముందుగా మీడియా ముందు కరపత్రాలు విడుదల చేసి, రాష్ట్ర బీ.ఎస్పీ పార్టీ కార్యదర్శి, సోము రాంబాబు ముఖ్య అతిథిగా మాట్లాడుతూ వచ్చేనెల డిసెంబర్ ఒకటో తేదీన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటకరణకు వ్యతిరేకంగా బహుజన సమాజ్ పార్టీ ధర్నాకు ముఖ్యఅతిథిగా రాజ్యసభ ఎంపీ రాంజీ గౌతమ్ విచ్చేయుచున్నారు, ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, రాష్ట్ర కోఆర్డినేటర్ పూర్ణచంద్రరావు మాజీ డిజిపి, సెంట్రల్ కోఆర్డినేటర్ కే బాలయ్య, మాజీ ఎమ్మెల్యే రాజారావు, మరియు రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొంటున్నారు, ఈ సందర్భంగా బహుజన ధర్నా కరపత్రాన్ని ఆవిష్కరించారు, ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సోము రాంబాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 1966వ సంవత్సరంలో దళితుడైన తవణంపల్లి అచ్యుతరావు ఆమరణ నిరాహార దీక్షతో ప్రారంభమైన ఉద్యమం, రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా జరిగినదని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జరిపిన పోలీస్ కాలపుల్లో 32 మంది అమరులు త్యాగంతో సాధించుకున్న, విశాఖ స్టీల్ ప్లాంట్ ను నేటి పాలకులు, నిర్లక్ష్యంతో నష్టాలు పేరుతో ఆదానీ కంపెనీకి చేస్తున్న ప్రయత్నానికి వచ్చే డిసెంబర్ 1న విశాఖపట్నం కూర్మన్నపాలెం సెంటర్లో జరుగు బహుజన ధర్నాకు ఉత్తరాంధ్ర నుండి పెద్ద ఎత్తున బహుజనలంతా తరలి రావాలని, బహుజన ప్రజా సంఘ నాయకులు, మేధావులు భారీ సంఖ్యలో కథలు రావాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో జరజాన నీలయ్య, వద్దీ పాపారావు, గురుబిల్లి రవికుమార్, శీర అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.